పింఛన్ల బాధ్యత నాదే..


ప్రచారంలో భాగంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డికి తిలకం దిద్దుతున్న మహిళలు


నర్మెట: కొలిమి వద్ద ఇనుము కాల్చుతున్న తాటికొండ రాజయ్య

- బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): జనగామ నియోజకవర్గం లో పింఛన్లు రాని వారికి ఇప్పించే బాధ్యత తనదే నని బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లద్నూరు, మర్మాముల, ధర్మారం, సలాఖపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 46 లక్షల పింఛన్లు ఇస్తున్నామని.. అధికారంలోకి వస్తే మరింత పెంచుతామన్నారు. మరో 5 రోజులు కష్టపడి పనిచేస్తే.. ఐదేళ్ల మీ కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు పెట్టుబడి సాయం కింద 11 సార్లు రైతుబంధు ఇచ్చిన ఘనుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. రైతుబంధు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారని విమర్శించారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఊసరవెల్లి లాగా పార్టీలు మారే ప్రతాప్‌రెడ్డికి తనను విమర్శించే అర్హత లేదన్నారు. అభివృద్ధిలో తనతో పోటీ పడాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు సుదర్శన్, స్రవంతి పర్శరాములుగౌడ్, రవీందర్‌రెడ్డి, దీపిక వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సమ్మయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సుమన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాలలో కాంగ్రెస్, సీపీఎం నుంచి పలువురు పల్లా రాజేశ్వర్‌రెడ్డి కుమారుడు అనురాగ్ సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. రసులాబాద్ సర్పంచ్ స్వామి ఆధ్వర్యంలో అయినాపూర్‌కు చెందిన ముస్లింలు పల్లా విజయం కోరుతూ పార్థనలు చేశారు.

అభివృద్ధి చేసే నాయకుడిని ఆదరించాలి

బచ్చన్నపేట: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రచారాన్ని నిర్వహించి కారు


జనగామ: పల్లా సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న 4వ వార్డు కౌన్సిలర్ సుమలతశ్రీశైలం

గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. తెలంగాణ జాగృతి సాంస్కృతిక సారథి మండల మాజీ అధ్యక్షురాలు పిన్నింటి కావ్యశ్రీ పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మన ప్రాంత వాసి జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్‌రెడ్డి, షబ్బీర్, నరేందర్, వెంకట్‌రెడ్డి, సిద్దిరాంరెడ్డి, బాల్‌రాజు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన తీన్మార్ మల్లన్న టీం జనగామ జిల్లా అధ్యక్షుడు తుప్పతి శ్రీనివాస్ శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకుడు గూడ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరాడు. చేరిన వారిలో గండి ప్రవీణ్, శ్రీశైలం, సంపత్, స్వామి, భాస్కర్, అర్జున్, రాజు, మహేష్, వెంకటేష్ ఉన్నారు. రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, నాయకులు కంసాని మహేందర్‌రెడ్డి, తుప్పతి భాస్కర్, మల్లేష్, అయిలయ్య, కిష్టయ్య, కనుకయ్య పాల్గొన్నారు.

4వ వార్డు కౌన్సిలర్ బీఆర్‌ఎస్‌లో చేరిక

జనగామ: జనగామ పట్టణాన్ని రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తానని జనగామ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. యశ్వంతాపూర్ బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ మంత్రి సుమలత శ్రీశైలం వందలాది మంది అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్ వార్డు అధ్యక్షుడు జూకంటి మధుసూదన్ ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకోగా, పల్లా స్వాగతించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, 20వ వార్డు కౌన్సిలర్ జూకంటి లక్ష్మీశ్రీశైలం, కొమురవెల్లి మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్, వీరస్వామి, అరుణ్ ఉన్నారు.

పట్టణంలో భారీ ర్యాలీ

జనగామ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోరుతూ పట్టణంలోని పాతగోదాంల నుంచి నెహ్రూపార్కు వరకు యువకులు, పార్టీ శ్రేణులు ర్యాలీ చేపట్టారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు రాజ్ కుమార్, కౌన్సిలర్లు శ్రీజరాంమ్మోహన్, యాదగిరి, కో ఆప్షన్ సభ్యులు మసీఉర్ రెహమాన్, నవీన్ గుప్తా, సలీం, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లా, పొన్నాల సతీమణుల ప్రచారం

పట్టణంలోని 13వ వార్డులో కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళ రాజు, పానుగంటి ప్రవీణ్ ఆధ్వర్యంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య సతీమణులు నీలిమ, అరుణ బీఆర్‌ఎస్ కారుగుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేపట్టారు. చెంచరపు పల్లవి, గంగ భవాని, సొడ శాంతి, గంగ, పుష్ప, యాదమ్మ ఉన్నారు. 3వ వార్డులో కౌన్సిలర్ సుధసుగుణాకర్ రాజుతో కలిసి జెడ్పీ చైర్మన్ సంపత్ రెడ్డి ప్రచారం చేశారు. డాక్టర్ రాజమౌళి, రాజయ్య, ఖాదర్, విష్ణుమూర్తి, బుచ్చయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

పల్లాను గెలిపించాలి

నర్మెట: పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని రైతు బంధు సమితి రాష్ట్ర చైర్మన్ తాటికొండ రాజయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పల్లా గెలుపు కోరుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని మూడో సారి కేసీఆర్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. పల్లా గెలుపుతో జనగామ సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌ల లాగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వడ్లకొండలో బైక్ ర్యాలీ

జనగామ రూరల్: బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోరుతూ శుక్రవారం ఎంపీపీ మేకల కళింగ రాజు ఆధ్వర్యంలో మండలంలోని వడ్లకొండ గ్రామంలో బైక్ ర్యాలీ తీశారు. ఈసందర్భంగా కళింగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కనిపిస్తున్న అభివృద్ధి దేశంలో ఎక్కడ లేదని.. దేశానికి రోల్ మాడల్‌గా తెలంగాణ ఉందని అన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

నేను స్థానికుడిని.. ఆదరించండి


బచ్చన్నపేట: నాగిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి దశమంతరెడ్డి


నర్మెట: మాట్లాడుతున్న రాజునాయక్

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దశమంతరెడ్డి

బచ్చన్నపేట: శాసనసభ ఎన్నికల్లో నియోజకవర్గంలో అందుబాటులో ఉండే స్థానిక నాయకుడిని ఆదరించాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తమ్మడపల్లి, చిన్నరామన్‌చర్ల, పోచన్నపేట, గంగాపూర్, నాగిరెడ్డిపల్లి, పడమటికేశ్వాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు స్థానికులు కాదని, జనగామ ప్రజల సొమ్మును దోచుకోవడానికి వస్తున్నారని.. వారికి ఈ ప్రాంత సమస్యలపై కనీస అవగాహన లేదని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులను ఇస్తుందని మరింత అభివృద్ధి చెందాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. జనగామను జిల్లాగా ఏర్పాటు చేయడానికి అనేక ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లామని, ఇప్పటికీ కోర్టుకు హాజరు అవుతున్నారని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పలు పార్టీలను మార్చాడని పల్లా గురించి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి వివరించాడని అన్నారు. బీజేపీకి ఎమ్మార్పీఎస్, వివిధ కులసంఘాల నాయకులు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బళ్ల శ్రీనివాస్, చౌడ రమేష్, వెంకట్‌రెడ్డి, బేజాడి సిద్దులు, వెంకటేష్, మహేష్, గద్ద రాజు పలువురు పాల్గొన్నారు.

కాషాయ జెండాకు పట్టం కట్టండి

నర్మెట: జనగామ నియోజకవర్గంలో బీజేపీ కాషాయ జెండాకు పట్టం కట్టాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుట్ల దశమంతరెడ్డిని గెలించాలని అన్నారు. ఇప్పుడు పోటీ చేసే ఆయా పార్టీల అభ్యర్థులు జనగామ నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారని పోటీపడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, కొన్నె రాజు, సిద్దులు, రమేష్, కిషోర్, నారాయణరెడ్డి, బాలచందర్, ప్రభాకర్, అజయ్, మురళి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

జనగామను ఏనాడు పట్టించుకోని పల్లా..


మహిళలకు దండం పెట్టి ఓటు అడుగుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


జనగామ: ప్రచారం చేస్తున్న మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మల్లేశం, జాయ మల్లేశం

- కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఎమ్మెల్సీగా ఉన్న పల్లా ఏనాడు జనగామ ప్రజల సమస్యలు పట్టించుకోలేదని కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 12వ వార్డులో ప్రతాప్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో లేని ద్రోహి పల్లా రాజేశ్వర్‌రెడ్డి డబ్బు సంచులతో జనగామ ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాడని మండిపడ్డారు. స్థానికేతరుడిని తరిమికొట్టి, స్థానికుడినైన తనను గెలిపించాలని కోరారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీలేదన్నారు. ప్రాజెక్టులు, కాంట్రాక్టుల పేరుతో కోట్లు దోచుకున్నాడని విమర్శించారు. అభివృద్ధితో పాటు ఉద్యోగ ఉపాధి కల్పనలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నెల రోజుల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 85 స్థానాలతో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందన్నారు. వంద రోజుల్లోపు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నాగపురి రాజలింగం, రాజారెడ్డి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ కొండల్‌రెడ్డి, నాయకులు పరమేశ్వర్, భాస్కర్‌రెడ్డి, నర్సింగరావు, ఆగంరెడ్డి, యాదయ్య, కళావతి, లింగం, సురేష్, మహిపాల్‌రెడ్డి, విజయ్, శ్రీకాంత్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి తరలింపును అడ్డుకున్నందుకే నాపై కక్ష..

తపాసుపల్లి రిజర్వాయర్ నీటిని సిద్దిపేటకు తరలించేందుకు అంగీకరించనందుకే తనపై కక్ష కట్టి పార్టీ నుంచి వెళ్లగొట్టారని జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పేదల భూములు కబ్జా చేసిన పల్లాకు పదవులు, కబ్జాలే కావాలి తప్ప ప్రజల బాగోగులతో పనిలేదన్నారు. ప్రస్తుతం జనగామ ఎమ్మెల్యేగా ఉన్న ముత్తిరెడ్డి ప్రచారంలో నీ వెంట ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అవినీతి రహిత పాలన అందుతుందని ప్రజలు నమ్ముతున్నారన్నారు. దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి నియోజకవర్గంలో తిరగాలని పల్లాకు సవాల్ విసిరారు.


బచ్చన్నపేట: సాల్వాపూర్‌లో మహిళలతో మాట్లాడుతున్న సాయిప్రియాంక

కొమ్మూరిని గెలిపించుకుందాం

జనగామ: జనగామ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని గెలిపించుకుని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగరబోయిన మల్లేశం, మున్సిపల్, మార్కెట్ మాజీ చైర్మన్లు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, పీసీసీ మెంబర్ చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 24వ వార్డు పరిధిలోని కుర్మవాడ, నాగులకుంట్ల, శివాలయం తదితర ఏరియాల్లో మహిళలు, యువకులతో ర్యాలీ నిర్వహిస్తూ కొమ్మూరి గెలుపు కోరుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ చేయి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నాయకులు నోముల సోమయ్య, శ్రీనివాస్, మహేష్, శ్రీశైలం, నరసింహులు, లక్ష్మణ్, రాజేష్, వెంకటేష్, మల్లేష్, గంగరబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 5వ వార్డు బాణపురం ఇందిరమ్మ కాలనీలో గడప గడపకు ప్రచారం చేపట్టారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమని వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానికులను గెలిపించుకుని, స్థానికేతరులను ఇంటికి పంపించాలన్నారు. పేద మధ్య తర గతి ప్రజలకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం లభించాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. నాయకులు మల్లారెడ్డి, సత్యనారాయణ, రఘు గౌడ్, కాసుల రాజు, రాజు, బత్తుల శ్రీనివాస్, దేవేంద్ర, రజియా, తదితరులు పాల్గొన్నారు. జనగామ మండలం గానుగుపహాడ్ గ్రామంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షుడు ముక్కెర యాదగిరి, రాములు, సిద్ధిరాములు, శివాజీ, ఐలయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు.

ఆదరించండి అభివృద్ధి చేస్తాం

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గ ప్రజలు ఆదరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయన కూతురు సాయిప్రియాంక అన్నారు. శుక్రవారం మండలంలోని సాల్వాపూర్, మన్‌సాన్‌పల్లి, దబ్బగుంటపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, మహిళలతో కలిసి ఇంటింటా తిరుగుతూ ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో ప్రతాప్‌రెడ్డి ఈ ప్రాంతంలో పలు పదవులలో పని చేసి పలు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించారని అన్నారు. ఈ ప్రాంత అన్నదాతల కరువును తీర్చడానికి గోదావరి జలాలను తీసుకొచ్చి సస్యశ్యామలం చేసినారని తెలిపారు. ఆదరించి గెలిపిస్తే అందరికి అందుబాటులో ఉంటూ పని చేస్తారని అన్నారు. ఆరు గ్యారంటీల కార్డులను అందిస్తూ వాటిని గురించి వివరించారు. ఈ సారి అవగాహన లేని వ్యక్తులకు ఓటు వేసి బాధపడకుండా అందుబాటులో ఉండే ప్రతాప్‌రెడ్డి చేయి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అందరిని ఆప్యాయంగా పలుకరిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాల నాయకులు మహిళలు పాల్గొన్నారు.

స్థానిక నాయకుడిని ఎన్నుకోవాలి

అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో అందుబాటులో ఉండే స్థానిక నాయకుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఎన్నుకోవాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నల్లగోని బాలకిషన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వార్డుల్లో, పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతాప్‌రెడ్డి రెండు సార్లు జెడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా మన ప్రాంతాన్ని అభివృద్ధి చేశాడని అన్నారు. మన సమస్యలు తెలిసిన నాయకుడు వాటిని తప్పకుండా తీరుస్తాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న ఆరు గ్యారంటీ కార్డులను అందిస్తూ వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు వేణువందన, బుర్రా బాలమణి, ఎల్లారెడ్డి , శ్రీనివాస్, రాజిరెడ్డి, మోహిన్‌రెడ్డి, మహాత్మాచారి, రమేష్, అయిలుమల్లయ్య పలువురు పాల్గొన్నారు.

దేశంలోనే కాళేశ్వరం అతిపెద్ద కుంభకోణం


మాట్లాడుతున్న డీకే శివకుమార్, చిత్రంలో స్టేషన్ ఘన్‌పూర్ అభ్యరి ఇందిర


దీకేను గజమాలతో సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే..
- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

ధర్మసాగర్: కాళేశ్వరం ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని, కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు, ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. శుక్రవారం ధర్మసాగర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సింగపురం ఇందిరకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ నష్టపోతుందని తెలిసి కూడా తెలంగాణ ఇచ్చి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ మాట నిలబెట్టుకుందని తెలిపారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్) పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసి, దళితుడిని సీఎం చేస్తానని మాట ఇచ్చి తప్పారని మండిపడ్డారు. ఎంతమందికి డబుల్ బెడ్ రూం ఇళ్లు వచ్చాయని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ దళితులకు, రైతులకు, విద్యార్థి, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కాడని ఆరోపించారు. బీఆర్‌ఎస్, బీజే పీ రెండూ ఒకటేనని అన్నారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లులకు బీఆర్‌ఎస్ ఎంపీలు మద్దతు పలకడమే దానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు లీకేజీలమయమవుతుంటే కేసీఆర్ ప్రభుత్వం నిద్రపోతుందా.. అని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అన్నారు. కర్ణాటకలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూడటానికి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు బృందాన్ని పంపించాలని హితువు పలికారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ చారులత, శోభారాణి, గంగారపు అమృతరావు, మండల అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

కేసీఆర్ పర్మనెంట్‌గా ఫామ్‌హౌజ్‌కే..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్‌ను, ఆయన కుటుంబాన్ని పర్మనెంట్‌గా ఫామ్‌హౌజ్‌కే పరిమితం చేస్తామని డీకే శివకుమార్ అన్నారు. కమీషన్ తీసుకుని మేడిగడ్డ ప్రాజెక్టును నాసిరకంగా నిర్మించడంతో పిల్లర్లు కుంగిపోయాయని తెలిపారు.

రేపటి నుంచి జీడికల్ జాతర

- 27న పుష్కర స్నానాలు
- డిసెంబర్ 1న సీతారాముల కల్యాణోత్సవం



లింగాలఘణపురం: మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి జాతర ఈనెల 26న కార్తీక శుద్ధ చతుర్దశిన లక్ష్మీపూజ, ఆరగింపు తీర్థ గోష్ఠితో జాతర ప్రారంభమై డిసెంబర్ 9తో ముగియనుంది. 27న కార్తీక మాస పుష్కరస్నానాలు, డిసెంబర్ 1న సీతారాముల తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. రెండో భద్రాద్రిగా పేరుగాంచిన వీరాచల రామచంద్రస్వామి జాతరకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి హాజరయ్యే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతోపాటు వసతులు, పరిసరాల శుభ్రత పనులు చేపట్టారు.

అవినీతి రహిత రాజకీయ వ్యవస్థ రావాలి

స్టేషన్‌ఘన్‌పూర్: అవినీతి రహిత నూతన రాజకీయ వ్యవస్థ కోసం, ప్రజాస్వామ్య బద్ధంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం యువకులు, మేధావులు, కర్షకులు, మహిళలు పాటుపడాలని జనపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు భరత్ అన్నారు. డివిజన్ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలనలో అవినీతి, అక్రమాలు అధికమయ్యాయని ఆరోపించారు. మరోసారి దగా చేసేలా హామీలు చేస్తున్నారని అన్నారు.

ప్రజల జీవితాల్లో మార్పు మా లక్ష్యం

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణలోని మూడున్నర కోట్ల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీల జీవితాల్లో విప్లవాత్మక మార్పు లక్ష్యంగా ధర్మ సమాజ్‌పార్టీ పనిచేస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా డీఎస్పీ ఘన్‌పూర్ నియోజకవర్గ అభ్యర్థి కొట్టె ఏసేబు తరపున డివిజన్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు.

వేముగంటి అభిషేక్‌కు సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్: యూపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే ఐఈఎస్(ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్)లో ఆల్ ఇండియా 42వ ర్యాంకు సాధించిన వేముగంటి అభిషేక్‌ను స్థానిక సెయింట్ థామస్ హైస్కూల్‌లో యాజమాన్యం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు.

సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలి

దేవరుప్పుల : సైబర్‌నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై సదానందం సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ రాపోలు ప్రభాకర్ అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

బీజేపీతో సమస్యలు తీవ్రతరం

సంక్షిప్త సమాచారం..

జనగామ రూరల్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలు తీవ్రతరం అయ్యాయని మాజీ ఎంపీ, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు ఎం డీ సుభాషిణి అలీ అన్నారు. శుక్రవారం పట్టణంలో సీపీఎం అభ్యర్థి మోకు కనకారెడ్డి ప్రచారంలో భాగంగా బహిరంగ సభ నిర్వహించారు.

అభివృద్ధిని చూపిస్తాం రండి

చిల్పూరు: సర్పంచ్, ఎంపీటీసీలుగా గెలిచి నేటికి గ్రామంలో చేసిన అభివృద్ధిని చూపిస్తాం.. రండి అంటూ కాంగ్రెస్ నాయకులకు సర్పంచ్, ఎంపీటీసీలు శుక్రవారం సవాల్ విసిరారు. మండలంలోని రాజవరం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్పంచ్ మారేపల్లి తిరుమల, ఎంపీటీసీ మారేపల్లి లలితదేవి మాట్లాడారు.

విజయభేరి సభకు తరలిన నాయకులు

దేవరుప్పుల : పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి గెలుపు కోసం తొర్రూరులో తలపెట్టిన విజయభేరి సభకు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి పిలుపు మేరకు మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగానే తరలివెళ్లారు. టీపీసీసీ సభ్యుడు లక్ష్మీనారాయణనాయక్, శ్రీరాములు, కృష్ణమూర్తి, ధర్మారెడ్డి, రవీందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఎస్సై సేవ

చిల్పూరు: మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన మోటం వెంకటమ్మ శుక్రవారం గ్రామంలో ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొంది. ర్యాలీలో ఒక్కసారిగా మూర్ఛతో కిందపడి పోయింది. అదే సమయంలో ఎన్నికల విధుల్లో ఉన్న చిల్పూరు ఎస్సై వినయ్‌కుమార్ వెంటనే ఆమె వద్దకు వెళ్లి సపర్యలు చేశారు. అనంతరం ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. సర్పంచ్, ఎంపీటీసీ ఎస్సైని అభినందించారు.

ప్రజల పక్షాన నిలిచేది ఎర్రజెండానే..

దేవరుప్పుల: ప్రజల పక్షాన నిలిచి పరిష్కరించేది ఎర్రజెండా మాత్రమేనని పాలకుర్తి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా అన్నారు. శుక్రవారం మండలంలో ధర్మపురం, దేవరుప్పుల, కామారెడ్డి గూడెం, సీతారాంపురం, కడవెండి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు.

ప్రజా సేవ చేస్తా.. గెలిపించండి

చిల్పూరు: ప్రజా సేవ చేస్తా ఓటువేసి గెలిపించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి మారపాక రమేష్ కోరారు. శుక్రవారం పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

హక్కులను సాధించుకోవాలి

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గంలో 16వేలకు పైగా ఉన్న వడ్డెరలు తమ హక్కులను సాధించుకోవాలని వడ్డెర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాత్రి రాజనర్సు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దండుగుల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డెరలు దుర్భర జీవితాలను వెళ్లదీస్తున్నారని అన్నారు.